జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికి అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 110 | శనివారం 13 సెప్టెంబరు - 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from : Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేసిన రాధాకృష్ణన్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12,(సందేశం టైమ్స్) : నేడు చంద్రాపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ భారత 15వ ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేశారు. శుక్రవారం ఉదయం రాష్ట్రపతి భవన్‌లో ఆయన ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. రాధాకృష్ణన్ చేత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణస్వీకారం చేయించారు. రాధాకృష్ణన్ ఆంగ్లంలో ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా, రక్షణశాఖామంత్రి రాజ్‌నాథ్‌సింగ్, బిజెపి జాతీయ అధ్యక్షుడు జె.పి నడ్డా, మాజీ ఉపరాష్ట్రపతి హామీద్ అన్సారీ, వెంకయ్యనాడుతోపాటు తదితరులు హాజరయ్యారు.

కాగా, జూలై 21న జగదీప్ ధన్‌కర్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేయడంతో.. ఎన్నిక అనివార్యమైంది.

## 27,650 టన్నులు

**రాష్ట్రానికి నాలుగు రోజుల్లో రానున్న యూరియా**
**గత 2 రోజుల్లో 23 వేల టన్నుల సరఫరా**
**రైతులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి తోడ్పడేలా**
**వ్యవసాయశాఖకు ప్రత్యేక యాప్: మంత్రి తుమ్మల**



హైదరాబాద్, సెప్టెంబరు 12 (సందేశం టైమ్స్) : మరో నాలుగు రోజుల్లో రాష్ట్రానికి 27,650 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని, గత రెండ్రోజుల్లో 23 వేల టన్నుల యూరియా రాష్ట్రానికి సరఫరా అయిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ గోపి, ఇతర అధికారులతో తుమ్మల సమీక్ష నిర్వహించారు. గురువారం ఒక్కరోజే వివిధ కంపెనీల నుంచి 11,930 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి వచ్చిందని, శనివారం మరో 5,680 మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి వస్తుందని తెలిపారు. వివిధ కంపెనీల నుంచి 11 రైల్వే రేకుల యూరియా రాష్ట్రానికి ఇప్పటికే తరలిందని, 18 తేదీ నాటికి మరో 11 రైల్వే రేకుల యూరియాకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

2 లో

## బాసర నుంచి భద్రాచలం వరకూ...

# శాశ్వత ఘాట్లు

**రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలూ శాశ్వత ప్రాతిపదికనే..**
**దక్షిణ భారత కుంభమేళాగా గోదావరి పుష్కరాలు నిర్వహిద్దాం**
**ప్రధాన ఆలయాలు, అక్కడి ఘాట్ల అభివృద్ధికి తొలి ప్రాధాన్యం**
**గోదావరి పుష్కరాలపై సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్ నిర్దేశం**



హైదరాబాద్, సెప్టెంబరు 12(సందేశం టైమ్స్) : "గోదావరి పుష్కరాలను దక్షిణ భారత కుంభ మేళాగా నిర్వహించాలి. పరీవాహకంలోని 74 ఆలయాల్లోనూ పుష్కరాల నిర్వహణకు శాశ్వత ఏర్పాట్లు చేయాలి. పుష్కర ఘాట్లను శాశ్వత ప్రాతిపదికన నిర్మించాలి. అందుకు అవసరమైన ముందస్తు ప్రణాళికలు తయారు చేయండి" అని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని సూచించారు. రద్దీని అంచనా వేసుకొని పుష్కర స్నానాలు ఆచరించేందుకు వచ్చే లక్షలాదిమంది భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని నిర్దేశించారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

మిగతా 2లో...

## గద్వాల్ చారిత్రక వారసత్వాన్ని నిలబెడతా!





2 లో

**టీటీడీ బ్రహ్మోత్సవాలకు ఏరువాడ జోడు పంచెలు**
**దేవీ నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక వేడుకలు**
**పూర్వీకుల ఆదర్శాలను పునరుద్ధరిస్తాం**
**గద్వాల్ సంస్థానం మహారాణి ఆదిలక్ష్మి దేవమ్ముని మనుమడు కృష్ణ రామ భూపాల్**

## బొగ్గు గనుల వేలంలో పాల్గొంటాం

**దేశంలో ఇతర ఖనిజాల వేలం పాటలో కూడా..**
**సింగరేణికి ప్రభుత్వం పచ్చజెండా**
**2 గనులు కోల్పోవడంతో**
**రూ.60 వేల కోట్ల నష్టం: భట్టి**



హైదరాబాద్, సెప్టెంబరు 12 (సందేశం టైమ్స్) : దేశంలో బొగ్గు గనుల వేలం ఎక్కడ జరిగినా పాల్గొనాలని నిర్ణయం తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. బొగ్గు గనులే కాకుండా ఇతర మినరల్స్ వేలంలో కూడా పాల్గొంటామని చెప్పారు. సింగరేణిని ఆర్థికంగా ఆదుకునే ప్రయత్నం చేస్తామన్నారు. ప్రజల కోసం, ప్రజల అవసరాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలో వేలం పాట ఆవశ్యతకపై భట్టి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కొద్ది మంది భావోద్వేగాలు సృష్టించి, వేలం పాటలో పాల్గొనకుండా సింగరేణిని, రాష్ట్రాన్ని నాశనం చేసే కుట్రలు చాలా కాలం పాటు చేశారని ఆక్షేపించారు.

మిగతా 2లో...

## సింగరేణిలో ప్రతి కాంట్రాక్టుకూ 25శాతం కమీషన్లు!

**అందులో 10% వాటా**
**కాంగ్రెస్ పెద్దలకు వెళ్తోంది**
**ఈ అంశంపై**
**సీఎం స్పందించాలి: కవిత**



2 లో

## ఏం చెబుదాం!?







2 లో

**న్యాయ నిపుణులతో చర్చల్లో దానం, కడియం**
**బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ తరపున పోటీ చేసిన నాగేందర్**
**వరంగల్ లోక్‌సభలో కాంగ్రెస్ అభ్యర్థి తరపున శ్రీహరి ప్రచారం**
**వివరణ ఇవ్వడంపై మల్లగుల్లాలు..**
**మరింత గడువు కోరిన ఎమ్మెల్యేలు**

## పాత వాహనాల స్క్రాప్‌తో రూ.40వేల కోట్ల జీఎస్టీ ఆదాయం: గడ్కరీ

2 లో

## గ్రూప్-1 పరీక్షలను తప్పనిసరిగా రద్దు చేయాలి: దాసోజు

2 లో

# 27,650 టన్నులు

మిర్యాలగూడ, కరీంనగర్, వరంగల్, పందిళ్లపల్లి, సనత్‌నగర్, నిజామాబాద్ రేక్ పాయింట్లకు చేరగానే... అవసరమున్న జిల్లాలకు సరఫరా చేస్తామని వెల్లడించారు. కాగా తుమ్మలతో ఇక్రిశాట్ ప్రతినిధులు శుక్రవారం సచివాలయంలో భేటీ అయ్యారు. చిక్కుళ్లు, తృణధాన్యాలు, మెరుగైన రకాలతోపాటు వివిధ రకాల పంటల్లో తాము అమలుచేస్తున్న వ్యవసాయ సాంకేతిక పద్ధతులను మంత్రికి వివరించారు. ఇక వ్యవసాయశాఖకు ప్రత్యేకంగా ఒక యాప్ తయారుచేసి, ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, పంటల యాజమాన్యం, రైతులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని అధికారులను తుమ్మల ఆదేశించారు. ఏఐ రంగంలో పనిచేస్తున్న సంస్థలతో కలిసి వృద్ధి చేయాలని సూచించారు. సచివాలయంలో నెదర్లాండ్స్‌కు చెందిన ఏఐ కంపెనీల ప్రతినిధులు తుమ్మలను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల ప్రత్యేక యాప్ అంశంపై వ్యవసాయశాఖ అదికారులను ఆదేశాలు జారీచేశారు. రాష్ట్రంలో వ్యవసాయరంగం, విత్తనోత్పత్తిలో సాధించిన ప్రగతిని పరిశీలించటానికి వచ్చిన ఆఫ్రికన్ ప్రతినిధులు, ఆఫ్రికన్ సీడ్ ట్రేడ్ అసోసియేషన్ కార్యదర్శి, ఇతర ప్రతినిధులు... రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల భేటీ అయ్యారు. దేశంలో ఉత్పత్తి అయ్యే విత్తనాల్లో 60 శాతం తెలంగాణలోనే ఉత్పత్తి అవుతున్నట్లు తుమ్మల వారికి వివరించారు.

# బాసర నుంచి భద్రాచలం వరకూ... శాశ్వత ఘాట్లు

పుష్కరాల నేపథ్యంలో చేపట్టాల్సిన పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. “2027లో జూలై 23వ తేదీ నుంచి గోదావరి పుష్కరాలు ప్రారంభమవుతాయి. ఇప్పటి నుంచి 22 నెలల వ్యవధి ఉన్నందున శాశ్వత ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించాలి. అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరం వెంట ఉన్న ధర్మపురి, కాళేశ్వరంతోపాటు అన్ని ప్రధాన ఆలయాలను మొదటగా అభివృద్ధి చేయాలి. ప్రధాన ఆలయాల వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అక్కడి పుష్కర ఘాట్ల అభివృద్ధిని తొలి ప్రాధాన్యంగా ఎంచుకోవాలి. ఆలయ అభివృద్ధితోపాటు శాశ్వత ఘాట్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలి. రెండో ప్రాధాన్యంగా పుష్కర స్నానాలకు వీలుగా ఉండే తీర ప్రాంతాలను అభివృద్ధి చేయాలి. ఒకేరోజు రెండు లక్షల మంది భక్తులు స్నానాలకు వచ్చినా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు ఉండాలి” అని సీఎం రేవంత్ రెడ్డి నిర్దేశించారు. రహదారుల నిర్మాణంతోపాటు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాల పార్కింగ్, తాగునీరు, వసతి తదితర భక్తులకు అవసరమైన సదుపాయాలన్నీ ఉండేలా పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరీవాహకంలోని ఆలయాలన్నింటినీ క్షేత్రస్థాయిలో సందర్శించి, ఆలయ కమిటీలు, అధికారులతో చర్చించి.. అవసరమైన అభివృద్ధి పనుల జాబితాను తయారు చేయాలని చెప్పారు.

# బొగ్గు గనుల వేలంలో పాల్గొంటాం

వేలంపాటలో పాల్గొనకపోవడం వల్ల సింగరేణి రెండు పెద్దబ్లాకులతో పాటు వాటి ద్వారా వచ్చే రూ.60 వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోయిందన్నారు. వేలంపాటలో పాల్గొనకపోతే ప్రైవేట్ సంస్థలకే మేలు జరుగుతోందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొత్తబ్లాకులు దక్కించుకోకపోతే 31 మిలియన్ టన్నులకు ఉత్పత్తి పడిపోతుందని, బొగ్గుబావులు మూతపడితే.. శాశ్వత ఉద్యోగులు 40వేల మంది, తాత్కాలిక ఉద్యోగులు 30వేల మంది రోడ్డున పడతారని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పుతో దేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు బొగ్గు బ్లాకులు దక్కించుకోవాలంటే విధిగా వేలం ద్వారానే పాల్గొనాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. సత్తుపల్లి, కోయగూడెం బ్లాకులు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయని, దీనివల్ల సింగరేణి 60 వేల కోట్లు, 15 వేల కోట్ల లాభాలను కోల్పోయిందన్నారు. దేశంలో ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు వేలంలో పాల్గొని... గనులు దక్కించుకుంటున్నప్పుడు సింగరేణి పాల్గొంటే తప్పేమిటని ప్రశ్నించారు. ప్రస్తుతం 38 గనుల్లో సింగరేణి బొగ్గు తవ్వకాలు చేపడుతోందని, రానున్న ఐదేళ్లలో 10 గనులు మూతపడనున్నాయన్నారు. ప్రస్తుతం ఏటా 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తున్నామని, కొత్త బ్లాకులు రానట్లయితే ఉత్పత్తి సగానికి పడనుందన్నారు. కాగా ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 200 ఖనిజ బ్లాకులను వేలం వేయాలని ప్రణాళికను రూపొందించినట్లు గనులు, భూగర్భ వనరుల శాఖ తెలిపింది. సున్నపు రాయి, లేటరైట్, మాంగనీస్, క్వార్ట్జ్, గ్రానైట్, కలర్ గ్రానైట్, డోలమైట్, రోడ్డు మెటల్ తదితర 200 ఖనిజ బ్లాకులను వేలం వేయాలని నిర్ణయించినట్లు భట్టికి సమర్పించిన ఆదాయం, ప్రణాళికపై నివేదికలో పేర్కొంది. వాటిలో సున్నపురాయి,మాంగనీస్, బేస్ మెటల్‌కు సంబంధించిన 32 భారీ ఖనిజ బ్లాకులు ఉన్నాయి.

# ఏం చెబుదాం!?

హైదరాబాద్, సెప్టెంబరు 12 (సందేశం టైమ్స్) : నోటీసులు అందుకున్న పది మంది ఎమ్మెల్యేల్లో ఎనిమిది మంది స్పీకర్‌కు వివరణ ఇచ్చారు! పిలిచినప్పుడు హాజరై దానిపై వాదనలు వినిపించాలంటూ బీఆర్ఎస్‌కు స్పీకర్ కార్యాలయం నోటీసులూ ఇచ్చింది! కానీ, దానం నాగేందర్, కడియం శ్రీహరి ఇంకా న్యాయ నిపుణులతో చర్చల్లోనే ఉన్నారు. వివరణ ఇచ్చేందుకు స్పీకర్ నుంచి మరింత గడువు కూడా కోరారు. ఇందుకు కారణం లేకపోలేదు. మిగిలిన ఎనిమిది మందిదీ ఓ దారి అయితే.. వీరిద్దరిదీ ‘రహదారి’ కావడమే ఇక్కడ సమస్య. అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ టికెట్‌పై గెలిచిన పదిమంది కాంగ్రెసలో చేరారని, వారిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. వారిని అనర్హులను చేయాలంటూ సుప్రీం కోర్టునూ ఆశ్రయించింది. బీఆర్ఎస్ ఫిర్యాదుపై మూడు నెలల్లోగా చర్యలు తీసుకోవాలని గత నెల 25న సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో చర్యలకు ఉపక్రమించిన స్పీకర్.. వివరణ ఇవ్వాల్సిందిగా పది మంది ఎమ్మెల్యేలకూ నోటీసులు జారీ చేశారు. వీరిలో దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగిలిన 8 మందీ స్పీకర్ కార్యాలయానికి వివరణ ఇచ్చారు. తాము పార్టీ మారలేదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే ఉన్నామని వివరణ ఇచ్చిన వారు.. దానికి సంబంధించిన ఆధారాలూ సమర్పించారు. దాంతో, విచారణకు పిలిచినప్పుడు హాజరై.. ఆయా కేసుల్లో బీఆర్ఎస్ తరఫున వాదనలు చెప్పాలంటూ ఆ పార్టీకి స్పీకర్ కార్యాలయం నోటీసులు ఇచ్చింది కూడా. అయితే వివరణ ఇచ్చేందుకు స్పీకర్‌ను దానం, కడియం కొంత గడువు కోరారు. కాంగ్రెస్ పార్టీ కార్యాచరణలో వారు పాల్పంచుకున్నట్లు స్పష్టమైన ఆధారాలున్న నేపథ్యంలో స్పీకర్‌కు ఇచ్చే వివరణపై న్యాయ నిపుణులతో వారు చర్చలు జరుపుతున్నారు. నిజానికి, బీఆర్ఎస్ టికెట్‌పై ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్.. ఆ తర్వాత సీఎం రేవంత్ రెడ్డిని కలిసి మూడు రంగుల కండువా కప్పుకొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఇక, స్టేషన్ ఘన్‌పూర్ నుంచి బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన కడియం శ్రీహరి.. లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన తన కుమార్తె కడియం కావ్య తరఫున బాహాటంగానే ప్రచారం చేశారు.

# సూర్యాపేటలో కొత్త అదనపు కలెక్టర్‌గా కొలనుపాక సీతారామారావు బాధ్యతల స్వీకరణ



సూర్యాపేట, సెప్టెంబర్ 12 :సూర్యాపేట జిల్లా కొత్త అదనపు కలెక్టర్ (రెవిన్యూ)గా కొలనుపాక సీతారామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్ కార్యాలయంలోని తన ఛాంబర్లో బాధ్యతలు తీసుకున్న అనంతరం, ఆయన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఇటీవల వరకు నల్గొండ జిల్లాలో స్పెషల్ కలెక్టర్ (ఐ క్యాడ్)గా విధులు నిర్వహించిన సీతారామారావు, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు సూర్యాపేటకు బదిలీ అయ్యారు. కొత్త అదనపు కలెక్టర్‌గా జిల్లా అభివృద్ధి పనులు, రెవిన్యూ విభాగానికి సంబంధించిన కార్యాచరణను పర్యవేక్షించనున్నారు.

# సింగరేణిలో ప్రతి కాంట్రాక్టుకూ 25శాతం కమీషన్లు!

హైదరాబాద్, సెప్టెంబరు 12 (సందేశం టైమ్స్) సింగరేణిలో అవినీతి రాజ్యమేలుతోందని, ప్రతి కాంట్రాక్ట్‌కు 25శాతం కమీషన్లు ఇవ్వాల్సి వస్తోందని, అందులో 10 శాతం వాటా కాంగ్రెస్ పెద్దలకు వెళ్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. జాగృతి కార్యాలయంలో హెచ్ఎంఎస్, సింగరేణి జాగృతి (ఏబీ సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ సింగరేణిలో అవినీతిపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తక్షణమే స్పందించాలన్నారు. లేదంటే ఈ విషయమై సీబీఐ, కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశారు. సింగరేణికి రూ.42వేల కోట్ల మేర బకాయిలు చెల్లించకుండా కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వహిస్తోందని ధ్వజమెత్తారు. లాభాల్లో ఉన్న సంస్థను నష్టాల్లోకి నెట్టే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. టీబీజీకేఎస్ నాయకులు అవినీతికి పాల్పడొద్దని గతంలోనే తాను హెచ్చరించినా.. పట్టించుకోలేదన్నారు. నిన్నటిదాకా ఆ సంఘం గౌరవాధ్యక్షురాలిగా తానే ఉన్నానని, కానీ.. అక్కడ జరిగిన అంశాలపై కచ్చితంగా మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో జరగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో హెచ్ఎంఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# గద్వాల్ చారిత్రక వారసత్వాన్ని నిలబెడతా!

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12(సందేశం టైమ్స్) : దేశంలోనే ఘనమైన చరిత్రకు ఆలవాలం గద్వాల్ సంస్థానం.. 400 వసంతాల చారిత్రక వారసత్వ, సాంస్కృతిక సంపదను పరిరక్షిస్తానని జీవీకే కూతురు కొడుకు– గద్వాల్ సంస్థానం వారసుడు కృష్ణ రామ భూపాల్ తెలిపారు. కొన్ని వందల ఏళ్లుగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బ్రహ్మోత్సవాల్లో శ్రీవేంకటేశ్వర స్వామికి గద్వాల్ సంస్థానం ఏరువాడ జోడు పంచెలు సమర్పిస్తోంది. ఈ ఏడాది నుంచి ఈ సంప్రదాయాన్ని ఆచరిస్తున్నట్లు కృష్ణ రామ భూపాల్ చెప్పారు. సంస్థానం చివరి పాలకురాలు మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ముని మనుమడే రామకృష్ణ భూపాల్. గద్వాల్ వారసత్వ, సాంస్కృతిక సంపద పరిరక్షణలో భాగంగా తన పూర్వీకులు నిర్మించిన ఆలయాలన్నింటినీ సందర్శించి వాటి స్థితిగతులు తెలుసుకుంటానన్నారు. తరతరాల ఆచారం ప్రకారం దేవీ నవరాత్రుల వేళ జోగులాంబ అమ్మవారికి గద్వాల్ చీరను సమర్పిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర దేవాదాయశాఖ సహకారంతో పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో అలంపూర్–జోగులాంబ ఆలయ ప్రాంగణంలో గుడి సంబురాలు నిర్వహిస్తామన్న రామ భూపాల్.. ఈ వేడుకలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. తద్వారా తమ పాలకులు ఆచరించిన సంస్కృతి, సంప్రదాయాలతోపాటు ఆధ్యాత్మిక, సాహిత్య కళా రంగాలకు వారు అందించిన సేవల పునరుద్ధరణకు కృషి చేస్తానని కృష్ణ రామ భూపాల్ తెలిపారు. తన పూర్వీకుల ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తానని నొక్కి చెప్పారు.

# పాత వాహనాల స్క్రాప్‌తో రూ.40వేల కోట్ల జీఎస్టీ ఆదాయం: గడ్కరీ

పనికి రాని, కాలుష్యకారకమైన 97 లక్షల వాహనాలను స్క్రాప్ చేయడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.40 వేల కోట్ల మేర జీఎస్టీ ఆదాయం వస్తుందని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ శుక్రవారం అన్నారు. ఈ ఏడాది ఆగస్టు వరకు మూడు లక్షల వాహనాలను తుక్కుగా మార్చినట్లు వెల్లడించారు. అందులో 1.41 లక్షల ప్రభుత్వ వాహనాలు ఉన్నాయన్నారు. ఈ మేరకు ఏసీఎంఏ వార్షిక సదస్సులో ఆయన మాట్లాడారు.

# గ్రూప్-1 పరీక్షలను తప్పనిసరిగా రద్దు చేయాలి: దాసోజు

గ్రూప్–1 పరీక్షలను తప్పనిసరిగా రద్దు చేయాలని నేత దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. పొన్నం ప్రభాకర్ ప్రెస్‌క్లబ్‌కు వచ్చి హైకోర్టు జడ్జిమెంట్‌పై చర్చించాలన్నారు. ‘గ్రూప్–1 పరీక్షల వ్యవహారంపై జ్యుడీషియల్ విచారణ జరగాలి. రాజ్యాంగబద్ధమైన సంస్థ నేతృత్వంలో ఘోరమైన తప్పిదం జరిగింది. ప్రభుత్వం దయచేసి రిట్ అప్పీల్ చేయవద్దు. గ్రూప్–1 పరీక్షను తిరిగి నిర్వహించాలి. విద్యార్థులపై పెట్టిన కేసులు విత్‌డ్రా చేయాలి’ అని డిమాండ్ చేశారు.

# బ్రోకర్లతో అప్రమత్తంగా ఉండాలని

## రైతులకు హెచ్చరిక

### కంగ్టి సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి




సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఎ 12 సెప్టెంబర్ 2025, శుక్రవారం: నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి సర్కిల్ పరిధిలో ఇటీవల భూమి కొనుగోలు, విక్రయాల్లో చోటు చేసుకుంటున్న మోసాల నేపథ్యంలో, రైతులు అప్రమత్తంగా ఉండాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి హెచ్చరించారు. కంగ్టి సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి తెలిపారు: "కొంత మంది దళారులు రైతులను మోసం చేయడానికి కొత్త పద్ధతులు అవలంబిస్తున్నారు. భూమి పాస్‌బుక్ చూపించి రోడ్డు పక్కన ఉన్న భూమిగా నమ్మించి తక్కువ ధరలకు ఎ 4, 6, 10, 12 లక్షలకి అమ్ముతామంటూ ప్రలోభాలు పెడుతున్నారు. నిజానికి ఆ భూములు గుట్టల మీద, లోయలలో, ప్రాజెక్టుల మునిగిపోయే ప్రాంతాల్లో ఉండే అవకాశం ఉంది. అటువంటి మోసాలకు రైతులు భయపడకుండా, అప్రమత్తంగా ఉండాలి." ఇంకా ఆయన అన్నారు: "కొంతమంది దళారులు, భూమి అమ్మే ఉద్దేశం లేకపోయినా రైతులతో అగ్రిమెంట్లు చేసుకొని 25% డబ్బు ఇవ్వడమని చెబుతూ, మిగిలిన డబ్బును చెల్లించకుండా రిజిస్ట్రేషన్ సమయంలో ఇబ్బందులు సృష్టిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో రైతులకు, బ్రోకర్లకు మధ్య న్యాయపరమైన సమస్యలు తలెత్తిన ఉదాహరణలు కల్హేర్, సిర్గాపూర్, కంగ్టి ప్రాంతాల్లో చూశాం."రైతులు భూమి అమ్మే ముందు కొన్ని ముఖ్యమైన విషయాలు తెలుసుకోవాలని ఆయన సూచించారు:భూమి స్థితి నిజంగా రోడ్డు పక్కన ఉందా అన్నదీ, రెవెన్యూ రికార్డుల్లో మ్యాప్‌ల్లో సరిపోతుందా అని పరిశీలించాలి. మధ్యవర్తులను కాకుండా గ్రామస్థాయిలో నమ్మదగిన వ్యక్తుల ద్వారా సమాచారం పొందాలి. టిపన్ చెక్ చేసుకోవాలి. చుట్టుపక్కల ఉన్న బౌండరీలు, సర్వే నంబర్లు స్పష్టంగా తెలుసుకోవాలి. "ఒకసారి సంతకం చేసిన తర్వాత, భవిష్యత్తులో కేసులు ఎదుర్కొనే పరిస్థితులు వస్తే తప్పించుకోవడం కష్టం. అందుకే రైతులు పూర్తిగా నిర్ధారణ చేసుకున్న తర్వాతే భూములు అమ్మడం జరగాలి" అని ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# సూర్యాపేట కలెక్టర్ ఆదేశాలు -

## ఇంటర్ విద్యార్థుల ఫలితాల్లో కనీసం 70% లక్ష్యం




సూర్యాపేట, సెప్టెంబర్ 13:ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో కనీసం 70 శాతం మార్కులు సాధించేలా టీచర్లు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూల్స్, వెల్ఫేర్ కళాశాలలు, కేజీబివి ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించిన ఆయన, విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపడేలా బోధనలో నాణ్యతను పెంచాలని సూచించారు. కళాశాలలపై నమ్మకంతో వచ్చే విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి, వారిని ఉన్నత శిఖరాలను చేరుకునేలా చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉన్నందున తల్లిదండ్రులతో తరచూ సమావేశాలు నిర్వహించి, హాజరు పెంపు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఇంటి వద్ద కూడా చదవడం అలవాటు చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థులకు మోటివేషనల్ క్లాసులు నిర్వహించి, పోటీ పరీక్షలకు ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా వంటి వనరులను వినియోగించుకునేలా మార్గనిర్దేశం చేయాలని ఆయన చెప్పారు. ప్రతి సోమవారం, మంగళవారం స్టాఫ్ 100% హాజరు తప్పనిసరి అని, అత్యవసరం కాకుండా సెలవులు మంజూరు చేయరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇటీవల నిర్వహించిన 1, 2 టెస్ట్ ఫలితాలపై ప్రిన్సిపాల్స్ తమ సిబ్బందితో సమీక్ష నిర్వహించాలని, వార్షిక పరీక్షలకు ముందు ప్రతి విద్యార్థి కనీసం 70 శాతం మార్కులు తెచ్చుకునేందుకు సబ్జెక్టు వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ నివేదికలపై సెప్టెంబర్ 22న సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా ఇంటర్ విద్యా అధికారి భాను నాయక్, జి.సి.డి.ఓ పూలన్, డి.సి.ఓలైన పద్మ, లక్ష్మి, పలువురు ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికుల సమస్యలపై చర్చించనున్న

## డిపో మేనేజర్ మల్లేశయ్య



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 12సెప్టెంబర్ 2025: డైలీ వర్ డిపో మేనేజర్ మల్లేశయ్య వెల్లడించిన వివరాల ప్రకారం, రేపు అనగా 13-09-2025 శనివారం నాడు, ఉదయం 11:00 గంటల నుండి 12:00 గంటల వరకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం డిపో కార్యాలయంలోనే జరుగనుంది. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి అభ్యర్థనలు, మరియు సేవల మెరుగుదలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు మల్లేశయ్య తెలిపారు. ప్రయాణికులు, మరియు ఇతర ఆసక్తి గల వ్యక్తులు ఈ సమావేశానికి హాజరై తమ సూచనలు, ఫిర్యాదులు వ్యక్తపరిచే అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. సంప్రదించవలసిన ఫోన్9959223170

# తెలంగాణలో ఇక సులభంగా

## కుల ధ్రువీకరణ పత్రాల జారీ




సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 12సెప్టెంబర్: కుల ధ్రువీకరణ పత్రాలను సులభంగా పొందేలా 'మీ సేవ' నూతన ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. బీసీ, ఎస్టీ, ఎస్సీ వర్గాలకు చెందిన పౌరులు(ప్రత్యేక కేసులు మినహా) ఇప్పుడు మీ సేవ కేంద్రాల్లో నేరుగా కుల ధ్రువీకరణ పత్రాలను పొందవచ్చు. గతంలో ప్రతి దరఖాస్తుకు కొత్తగా తహసీల్దార్ ఆమోదం పొందాల్సిన అవసరం ఉండేది. దీనివల్ల ధ్రువీకరణ పత్రాలు పొందడంలో జాప్యం ఏర్పడుతుండడంతో.. ఈ సమస్యను నివారించడానికి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాలతో.. మీ సేవ విభాగం దీనిపై దృష్టిపెట్టింది. సీసీఎల్ఏ, బీసీ సంక్షేమ, ఎస్సీ సంక్షేమ, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, తహసీల్దార్‌లతో పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించిన అనంతరం తాజా మార్పులు చేపట్టారు. ప్రయోగాత్మకంగా ఈ మార్పును 15 రోజుల క్రితం అమల్లోకి తెచ్చారు. ఇప్పటికే 17,571 మంది ఈ సేవను విజయవంతంగా పొందారు. ప్రతి సంవత్సరం దాదాపు 20 లక్షల మంది కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేస్తుంటారు. కొత్తగా జారీ చేసే సర్టిఫికెట్‌లో.. గతంలో ఆమోదించిన అధికారి వివరాలు, తిరిగి జారీ తేదీ ఉంటాయి. ప్రత్యేక కేసుల్లో(ఉదాహరణకు హిందూ ఎస్సీ నుంచి క్రైస్తవ మతంలోకి మారిన వ్యక్తి బీసీ-సీ కిందకు వస్తే.. జీవో ఎంఎస్ నం.3, తేదీ 9.9.2020 ప్రకారం) దరఖాస్తును గత ప్రక్రియ ప్రకారం ఆమోదం కోసం పంపిస్తారు.

సేవను ఎలా పొందాలంటే...పాత సర్టిఫికెట్ నంబర్ తెలిస్తే: మీ సేవ కౌంటర్‌లో ఆ నంబర్‌ను అందించడం ద్వారా కొత్త ప్రింటవుట్ పొందవచ్చు. నంబర్ తెలియకపోతే: మీ సేవ సిబ్బంది మీ జిల్లా, మండలం, గ్రామం, ఉప-కులం, పేరు ఆధారంగా శోధిస్తారు. మరిన్ని వివరాల కోసం మీ సేవ వెబ్‌సైట్‌ను లేదా సమీపంలోని మీ సేవ కేంద్రాన్ని సంప్రదించవచ్చని మీ సేవ కమిషనర్ రవికిరణ్ తెలిపారు.

# ఉపాధ్యాయ దినోత్సవంలో

## ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానం

### అందోల్ నియోజకవర్గంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 12సెప్టెంబర్: సంగారెడ్డి జిల్లా, అందోల్ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అందోల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, వారి సేవలను మంత్రి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, "విద్యా మరియు వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోంది" అని తెలిపారు. అందోల్ నియోజకవర్గాన్ని విద్యా మరియు విజ్ఞాన కేంద్రాలుగా మారుస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా బాలికల విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే మహిళా పాలిటెక్నిక్ కాలేజీలు, నర్సింగ్ కాలేజీలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని వెల్లడించారు. ఇక, సుమారు 160 ఎకరాల్లో ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న జేఎన్‌టీయూ విద్యాసంస్థ ప్రజలకు ప్రగతికి దోహదపడే కేంద్రంగా రూపుదిద్దుకుంటోందని చెప్పారు. "ప్రజలకు మెరుగైన విద్యను, ప్రమాణాలతో కూడిన వైద్య సేవలను అందించడమే మా లక్ష్యం. దేశానికి ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది," అని మంత్రి పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డు పొందిన ఉత్తమ అధ్యాపకులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు, వారికి ప్రత్యేక సన్మానం చేశారు.

# సీతారాం ఏచూరి స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగిస్తాం

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి సాయిలు




సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 12సెప్టెంబర్: సిపిఎం పార్టీ అఖిల భారత మాజీ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరిలేని లోటు తీరనిదని ఆయన స్ఫూర్తి తో ఉద్యమాలు ముందుకు తీసుకెళ్తామని సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి సాయిలు అన్నారు ఈ సందర్భంగా సీతారాం ఏచూరి గారి ప్రథమ వర్ధంతి సందర్భంగా జోగిపేటలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు అనంతరం మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వాపక్ష ఉద్యమాల పట్ల చురుకుదనంగా వ్యవహరిస్తూ జెఎన్యు యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ నాయకునిగా పనిచేస్తూ అంచలంచలుగా ఎదిగి ఆలిండియా జాతీయ కార్యదర్శి స్థాయికి ఎదిగారని ఆయన స్ఫూర్తి ఆయన ధైర్యం చాలా గొప్పదని ఎమర్జెన్సీ టైములో దేశ ప్రజల కోసం అప్పటి ప్రధాని ఇంద్ర గాంధీనే ఎదిరించిన ధైర్యాలి, లౌకిక విలువల కోసం నిరంతరం పరితపించిన మేధావి అని దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసి 37 పార్టీలను ఎక్కం చేసి ఇండియా కూటమికి ఏర్పాటుకు కృషిచేసిన గొప్ప మేధావి ఆయన స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని ఆయన ఆశయాలు సాగించడానికి కార్మిక ఉద్యమాలు ప్రజా పోరాటాలు రైతు సమస్యలపై నిరంతరం కృషి చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో ఆందోల్ డివిజన్ కార్యదర్శి డి విద్యాసాగర్ ఏరియా కమిటీ సభ్యులు రాములు కృష్ణ వెంకటేశం మహేష్ యాదగిరి రాములు రమేష్ తదితరులు పాల్గొన్నారు

# సంఘాల గుర్తింపు రద్దు నోటీసుల ఉపసంహారణ

## సీఎం చంద్రబాబుకు ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ధన్యవాదాలు



సెప్టెంబర్ 12 (సందేశం టైమ్స్) :ఉద్యోగ సంఘాలపై గత ప్రభుత్వ అరాచక చర్యలను కూటమి ప్రభుత్వం ఉప సంహరించుకోవడం అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ పేర్కొన్నారు. ఇందుకు సీఎం కు, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. నాడు ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు చెల్లించాలని అడిగితేనే అరెస్టు చేసి, చంపేయమన్న రోజులు చూశామని, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, ఏపీ వాణిజ్య పన్నుల సర్వీసుల సంఘం గుర్తింపును రద్దు చేస్తామంటూ నోటీసులు ఇచ్చారన్నారు. గవర్నర్‌ను కలవడమే నాటి ప్రభుత్వానికి నేరంగా కనిపించిందని, అయితే కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ అరాచక నిర్ణయాన్ని ఉ పసంహరిస్తూ నిర్ణయం తీసుకుని రాజ్యాంగ హక్కులను కాపాడిందన్నారు.

బీసీల్లో గ్రూప్ బి-సీరియల్ నంబర్ 4లోని ఏ కులానికి సంబంధించి ఆ కులం పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలివ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఈడిగ, గౌడ(గమ్మళ్ల), కలాలీ, గౌండ్ల, శెట్టిబలిజ, శ్రీశయన(సెడిగి)కులాకు గౌడ అనే పేరు ముందు చేర్చి రెవెన్యూ శాఖ కుల ధ్రువీకరణ పత్రం ఇస్తోంది. ఇకపై గ్రూపు నంబర్ 4లోని కులాల పేరుతో ప్రత్యేకంగా కులధ్రువీకరణ పత్రాలు అందించాలని, గౌడను ముందు చేర్చకుండా సాఫ్ట్‌వేర్‌ను మార్పు చేయాలని సీసీఎల్ఏకు సూచిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

# ఉద్యానశాఖలో పోస్టింగ్‌లు



సెప్టెంబర్ 12 (సందేశం టైమ్స్) :ఉద్యానశాఖలో ఇటీవల డిప్యూటీ డైరెక్టర్లుగా పదోన్నతి పొందిన పలువురికి ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది. కమిషనరేట్‌లోని పీఎన్‌వీ లక్ష్మీనారాయణను విజయనగరం జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా, నెల్లూరు ఎంఐపీ పీడీ బి.శ్రీనివాసులును డిప్యుటేషన్‌పై అమరావతి అభివృద్ధి సంస్థకు, ఏపీ ఇరిగేషన్, ప్రస్తుతం లైవ్లీహుడ్ ప్రాజెక్ట్‌లో ఉన్న కె.సజానాయక్‌ను ఏలూరు జిల్లా ఉద్యాన అధికారిగా, పశ్చిమగోదావరి ఉద్యాన అధికారి జి.ప్రభాకర్‌రావును డైరెక్టరేట్‌కు బదిలీ చేసింది. కడప ఏపీఎంఐపీలో ఏడీ వెంకటేశ్వర‌రెడ్డిని అక్కడే డీడీగా, టెక్కలి ఉద్యానశాఖ ఏడీ చిట్టిబాబును విజయనగరం జిల్లా ఉద్యాన అధికారిగా, తిరుపతి ఏపీఎంఐపీలో ఏడీ సతీష్‌ను కడప జిల్లా ఉద్యాన అధికారిగా నియమించింది.

# ఉద్యోగోన్నతులపై విచారణ



ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబర్ 12 (సందేశం టైమ్స్) : జిల్లా వైద్యారోగ్యశాఖ పరిధిలో గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలకు గ్రేడ్-3 ఉద్యోగోన్నతులపై ఫిర్యాదులు రావడంతో వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. నాలుగు నెలల క్రితం సుమారు 200 మందికిపైగా ఏఎన్‌ఎంలకు ఉద్యోగోన్నతి కల్పించారు. అందులో పలు అవకతవకలు చోటుచేసుకున్నాయని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య ఇటీవల వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వారు విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్యారోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ నాయక్ నేతృత్వంలోని బృందం విచారణ నిర్వహించింది. పలువురు ఏఎన్‌ఎంలను పిలిచి విచారించింది. ఫిర్యాదుదారుడైన చెన్నయ్యతో కూడా మాట్లాడింది. అంతకు ముందు ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితా, ఇతర రికార్డులను పరిశీలించింది. ఈ సందర్భంగా పలు అనుమానాలకు వైద్యశాఖ అధికారులు నివృత్తి చేసినట్లు సమాచారం. ఫిర్యాదుదారుడు మాత్రం ఏడుగురికి కల్పించిన ఉద్యోగోన్నతుల్లో పలు అక్రమాలు, అవకతవకలు చోటు చేసుకున్నాయని ఆరోపిస్తూ తన వద్ద ఉన్న ఆధారాలను సమర్పించినట్లు తెలిసింది.

# సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె



అమరావతి, సెప్టెంబర్ 12 (సందేశం టైమ్స్) : డిగ్రీ కాలేజీల ఫీజు బకాయిలు, ఇతర సమస్యలను ఈ నెల 20లోగా పరిష్కరించకపోతే సమ్మె చేపడతామని, నిరవధికంగా కాలేజీలను మూసివేస్తామని ప్రైవేటు డిగ్రీ కాలేజీ యాజయాన్యాల సంఘాలు ప్రకటించాయి. రెండు ప్రధాన సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.రమణాజీ, సి.విజయభాస్కర్ రెడ్డి, పి.జయరాం, పి.పెద్దిరాజు ఈ మేరకు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా డిగ్రీ కోర్సులకు కొత్త ఫీజులు ఖరారు చేయాలని కోరారు. డిగ్రీ కోర్సులకు ఫీజులు నిర్ణయించే అధికారం ఉన్నత విద్య కమిషన్ నుంచి యూనివర్సిటీల పరిధిలోకి మార్చాలని డిమాండ్ చేశారు. డిగ్రీ కాలేజీలకు అఫిలియేషన్ ఐదేళ్లకు పెంచాలని, అన్ని యూనివర్సిటీలకు కామన్ అఫిలియేషన్ విధానం అమలుచేయాలని, డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్లలో జరుగుతున్న గందరగోళాన్ని తొలగించాలని పేర్కొన్నారు. పది రోజుల్లో ఈ డిమాండ్లు పరిష్కరించని పక్షంలో నిరవధిక సమ్మెకు దిగి కాలేజీలు మూసివేస్తామని స్పష్టంచేశారు. దీనిపై సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి, ఆర్థిక శాఖ మంత్రి, విద్యాశాఖ ఉన్నతాధికారులకు వారు లేఖలు రాశారు. గత ఐదేళ్లలో ఉన్నత విద్యకు సరైన తోడ్పాటు లేకపోయినా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఎంతో కృషి చేశామన్నారు. గత ప్రభుత్వంలో అశాస్త్రీయంగా డిగ్రీ కోర్సులకు ఫీజులు ఖరారు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం సరైన ఫీజులు నిర్ణయించి, సకాలంలో వాటిని విడుదల చేసిందని, కానీ ఈసారి 16 నెలల్లో కేవలం ఒక్క విడత ఫీజులే కాలేజీలకు అందాయని వివరించారు.రాష్ట్రంలో ఉన్న 1380 డిగ్రీ కాలేజీల్లో 4.5 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని, ఫీజులు పెండింగ్ వల్ల కాలేజీలు నడపలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. లెక్చరర్లకు జీతాలు ఇవ్వలేకపోతున్నామని, నిర్వహణ వ్యయాలు భరించలేకపోతున్నామన్నారు. చివరికి అప్పులు కూడా పుట్టని పరిస్థితి తలెత్తిందన్నారు. అందువల్ల వెంటనే ఫీజులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# తారా ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

## – సెప్టెంబర్ 15, 16 తేదీల్లో నిర్వహణ




సందేశం టైమ్స్, సంగారెడ్డి ఎ సెప్టెంబర్ 12:సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్తు ద్వారా డిగ్రీ ప్రవేశాల కోసం మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు సెప్టెంబర్ 15 మరియు 16 తేదీల్లో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా. ప్రవీణ్ తెలిపారు.ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహించనున్న ఈ స్పాట్ అడ్మిషన్ల ద్వారా కింది కోర్సుల్లో మిగిలిన సీట్లకు ప్రవేశాలు అందుబాటులో ఉంటాయి:

బి.ఏ. (తెలుగు మీడియం)

బి.ఏ. (పబ్లిక్ పాలసీ)

బి.బి.ఏ. (రిటైలింగ్)

బి.సి.ఏ.

బి.కాం. (బి.ఎఫ్.ఎస్.ఐ / కంప్యూటర్ అప్లికేషన్స్ / హెచ్.ఆర్)

బి.ఎస్.సి. (లైఫ్ సైన్సెస్ / ఫిజికల్ సైన్సెస్ / ఫార్మా)

ప్రిన్సిపల్ తెలిపారు???, దోస్తు ద్వారా ఈ స్పాట్ అడ్మిషన్లలో సీట్లు పొందిన విద్యార్థులకు ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదా స్కాలర్‌షిప్ వర్తించదు. కావున విద్యార్థులు తమ నిర్ణయం తీసుకునే ముందు ఈ విషయం గమనించాలని సూచించారు. సంబంధిత కోర్సుకు సంబంధించిన ఫీజు మొత్తం విద్యార్థులే స్వయంగా భరించవలసి ఉంటుందని స్పష్టం చేశారు.

అడ్మిషన్ సమయంలో తినివ్వవలసిన డాక్యుమెంట్లు:

ఒరిజినల్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్

అన్ని ఒరిజినల్ విద్యా సర్టిఫికెట్లు

అన్ని సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు – ఒక్కో కాపీ

2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు

ఈ స్పాట్ అడ్మిషన్లకు ఇదే చివరి అవకాశం కావడంతో, ఇప్పటివరకు ఎక్కడా అడ్మిషన్ పొందని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు.

మరిన్ని వివరాలకు:విద్యార్థులు 9441069020 నెంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

# నల్లంపల్లి గ్రామంలో లక్ష్మి ఆకస్మిక మృతి – గ్రామంలో విషాద ఛాయలు



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12:సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం నల్లంపల్లి గ్రామానికి చెందిన బర్దిపురం అశోక్ భార్య లక్ష్మి (27) ఆకస్మికంగా మృతి చెందడం గ్రామ ప్రజలను విషాదంలో ముంచెత్తింది. ఆమె మృతితో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు, స్నేహితులు, కుల బంధువులు అందరూ కన్నీటి పర్యంతమయ్యారు.లక్ష్మికి ఇద్దరు చిన్నారులు – పెద్ద కుమార్తె అశ్విని (5), చిన్న కుమార్తె శ్వేత (3). చిన్న వయస్సులో అమ్మను కోల్పోయిన ఆ పిల్లల దుస్థితి అందరి హృదయాలను కలిచివేసింది. గ్రామస్థులు మాట్లాడుతూ, “లక్ష్మి అందరితో కలుపుగోలుగా ఉంటూ, ఎప్పుడూ చిరునవ్వుతో పలకరించే వ్యక్తి. ఆమె మృతి అనేది ఊహించని విషాదం. ఓ మంచి మనిషిని దేవుడు చాలా త్వరగా తీసుకెళ్లారు,'' అంటూ కన్నీటి కళ్ల ముడుచుకున్నారు. ముదిరాజ్ కుల బంధువులు ఆమె కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉ ంటామని హామీ ఇచ్చారు. గ్రామ పెద్దలు, నాయకులు, గ్రామస్థులు ప్రభుత్వ పరంగా ఆమె కుటుంబానికి ఆర్థిక సహాయం అందేలా చూస్తామని తెలియజేశారు.ఆమె అంత్యక్రియలు గ్రామంలో జరిగింది. వందల సంఖ్యలో గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు పాల్గొని ఆమెకు కన్నీటి వీడ్కోలు పలికారు


# ఆక్వా రైతుకు ధరల స్థిరీకరణ అవసరం



## అమెరికా అధిక సుంకాలతో కుదేలు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిసారించాలి
## సీడ్, ఫీడ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి
## రాష్ట్ర స్థాయి ఆక్వా రైతుల సదస్సులో వక్తలు


%విజయవాడ సిటి సెప్టెంబర్ 12 (సందేశం టైమ్స్): "దేశ వ్యాప్తంగా రొయ్యలు, చేపల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ వాటా 70 శాతం. దేశానికి ఏడాదికి రూ.60 వేల కోట్ల ఆదాయాన్ని పన్నుల రూపంలో రాష్ట్ర ఆక్వా రైతులు సమకూర్చుతున్నారు. మార్కెట్ సెస్, ఇతర పన్నుల రూపంలో రాష్ట్రానికి రూ.30 వేల కోట్ల ఆదాయం వస్తోంది. రాష్ట్రంలోని ఆక్వా ఉత్పత్తులు ప్రపంచంలోని 60 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఒక్క అమెరికా అధిక సుంకాలు వేసినందుకే వనామి, టైగర్ రొయ్యల ధరలు అమాంతం పడిపోయాయి. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిన్నకుండిపోవడం దురదృష్టకరం. రైతు ప్రభుత్వమని వేదికలపై ఊకదంపుడు ఉపన్యాసాలే తప్ప, వాస్తవంగా రైతులను ఆదుకున్న దాఖలు కనిపించడం లేదని" పలువురు రైతు సంఘాలు, ఆక్వా రైతు సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయి ఆక్వా రైతుల సదస్సు విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో గురువారం జరిగింది. రొయ్యల ధరలు నానాటికి క్షీణిస్తున్న తరుణంలో రాష్ట్రంలోని రైతులు ఈ సదస్సు ద్వారా వారి అభిప్రాయాలను వెల్లడించారు. భవిష్యత్తు ఆహార ఉత్పత్తుల అవసరాల దృష్ట్యా సాగు విస్తీర్ణం పెంచి, సబ్సిడీలు ఇచ్చి రైతులకు అండగా నిలిస్తే మరో 20 ఏళ్లలో ఏడాదికి రూ.6 లక్షల చొప్పున విదేశీమారక ద్రవ్యాన్ని సాధించవచ్చని రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య తెలిపారు. రొయ్యలు, చేపల సాగు చాలా ఖర్చుతో కూడుకున్న కష్టతరమైనదని, సుంకాలకు భయపడకుండా మార్కెట్‌ను విస్తృతం చేసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్వేషించి రైతులకు అండగా నిలవాలని ఆక్వా రైతుల సంఘం నాయకులు బి.బలరామ్ విజ్ఞప్తి చేశారు. రొయ్యలు, చేపల ఉత్పత్తులపై స్వయం సమృద్ధి సాధించే దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేయాలని జైభారత్ క్షీరరామ ఆక్వా రైతుల సంఘం కార్యదర్శి బోనం వెంకట నరసయ్య సూచించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర నాయకులు వక్కలగడ్డ భాస్కరరావు మాట్లాడుతూ.. యూరప్ దేశాల్లో సాగు విధానాలను అధ్యయనం చేశానని, ఆ దిశగా రైతులను ఆదుకోవాలని ఎన్నోసార్లు ఎన్నో ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశానని తెలిపారు. విదేశీ మాదకద్రవ్యాన్ని తీసుకొచ్చే ఆక్వా ఉత్పత్తులను పెంచేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. సీడ్, ఫీడ్, ఎక్స్‌పోర్ట్ కంపెనీలు సైబర్ మాఫియాగా తయారయ్యాయని వేటపాలెం ఆక్వా రైతుల సంఘ నాయకులు ఆమంచి స్వాములు ఆరోపించారు. 30, 40 కౌంట్ రొయ్యలు మాత్రమే ఆమెరికా వెళ్తాయని, ట్రంప్ సుంకాలను బూచిగా చూపించి 50, 60, 70, 80, 100 కౌంట్ రొయ్యల రేట్లను తగ్గించేసి, దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఆక్వా రైతులను విద్యుత్ శాఖ అధికారులు నిలువునా దోచుకుంటున్నాని ప్రకాశం జిల్లా ఆక్వా రైతుల సంఘం నాయకులు తేళ్ల రామయ్య మండిపడ్డారు.

## పాము కాటుతో వ్యక్తి మృతి




ఎల్‌ఎన్ పేట, సెప్టెంబర్ 12 (సందేశం టైమ్స్) : బసవ రాజుపేట గ్రామానికి చెంది న వాన అప్పలనాయు డు(38) పాముకాటుకు గురై మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. అప్పలనాయుడు గ్రామ సమీప పొలంలో ఎరువువేస్తుండగా కాలుకు పా ముచుట్టుకొని కాటువేసింది. దీన్ని గుర్తించిన అప్పలనా యుడు కుటుంబసభ్యులకు చెప్పగా.. వెంటనే హిరమండ లంలోని సుబలయి పీహెచ్‌సీకి తీసుకువెళ్లి చికిత్స అందించారు. పరిస్థితి విష మంగా ఉండడంతో 108 వాహనంలో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రి (రిమ్స్)కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా అప్పలనాయు డుకి భార్య కుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ హైమావతి కేసు నమోదు చేశారు.

## నిబంధనల సడలింపునకు సీసీఐ అంగీకారం



గుంటూరు సిటీ, సెప్టెంబర్ 12 (సందేశం టైమ్స్) : రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లుల యజమానులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న నిబంధనలను సడలించేందుకు సీసీఐ సూత్రప్రాయంగా అంగీకరించింది. దేశంలో ఉన్న జిన్నింగ్ మిల్లుల యజమానులు, సీసీఐ అధికారులతో టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి పద్మిని సింగ్లా గురువారం ఢిల్లీలో సమావేశం నిర్వహించారు. సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తా పాల్గొన్న ఈ సమావేశంలో లింట్ (దూది) నాణ్యతపై విధించిన పరిమితులను సడలించేందుకు పూర్తిస్థాయి అంగీకారం కుదిరింది. జిన్నింగ్ మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టే నిబంధనలు కూడా పూర్తిగా పక్కన పెడతామని హామీ ఇచ్చినట్టు తెలిసింది. పత్తి కొనుగోలు కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, రైతుల మ్యాపింగ్, ఎల్ 1, ఎల్ 2 కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలను రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికే వదిలేస్తున్నామని ప్రకటించినట్టు సమాచారం. సవరించిన నిబంధనలతో మరో నాలుగు రోజుల్లో కొత్త టెండర్ నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ టీఎంసీ కన్సార్టియం ప్రతినిధులు మన్నవ హరినాథ్‌బాబు, ఎల్‌సీటీసీ శంకర్ పాల్గొన్నారు.

## పొగాకు మడుల్లో యూరియా వాడకూడదు



దేవరపల్లి, సెప్టెంబర్ 12 (సందేశం టైమ్స్) : ప్రాథమిక దశలోనే పొగాకు నారు మడులు పెంపకం ఎంతో కీలకమైందని సీటీఆర్ఐ శాస్త్రవేత్త ప్రభాకరరావు అన్నారు. దేవరపల్లి మండలం పల్లంట్ల లో పొగాకు రైతులతో సమావేశం అనంతరం పొగాకు నారుమడులను సీటీఆర్ శాస్త్రవేత్తలు, పొగాకు బోర్డు అధికారులు పరిశీలించి మాట్లాడారు. ప్రతి రైతు నారుమడులు కట్టే దశలో ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అధిక దిగుబడినిచ్చే పొగాకు విత్తనా లను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నారుమడి పెంపకంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. నారుమడుల్లో యూరియా వాడకూడదని అమోనియ సల్ఫేట్ వాడాలని సూచించారు. రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ పొగాకు బోర్డు ఇచ్చిన పరిమితి మేరకే పంటసాగు చేయాలన్నారు. కార్యక్రమంలో దేవరపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి హేమస్మిత, ఫీల్డ్ ఆఫీసర్లు వినోద్, ప్రజాపతి, రైతులు గన్నమని ప్రసాద్, గంగాధర్, యలమాటి సురేశ్, బాబ్జీ, నలమాటి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నీటి కాలుష్యం వల్లే మరణాలు

మంగళగిరి సెప్టెంబర్ 12 (సందేశం టైమ్స్) : తురకపాలెంలో అంతు పట్టని మరణాలకు నీటి కాలుష్యం కారణమని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధక్షులు డాక్టర్ కెవిఎస్ సాయిప్రసాద్ తెలిపారు. ఇటీవల ఆ గ్రామంలో ప్రజా ఆరోగ్య వేదిక బృందం పర్యటించిన సందర్భంగా వివరాలను ఆయనవెల్లడించారు. మరణాలకు మతం రంగ పులమడం, విశ్వాసాలకు ఆపాదించే ప్రయత్నాలు సరికాదన్నారు. కొంతకాలంగా గ్రామంలో దాదాపు 100 మంది అంతుచిక్కని వ్యాధితో మరణించారనే సమాచారంతో తమ బృందం గ్రామంలోని అన్ని ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించిందని, నీటి కాలుష్యం వల్లే వ్యాధులు ప్రబలినట్లు తాము గుర్తించామని చెప్పారు. ప్రభుత్వం రక్షితనీటి సరఫరాను ఆ గ్రామానికి ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు వ్యాధులకు గురైనట్లు తెలిపారు. మందులు పెట్టి క్వారీలు పగలగొట్టినప్పుడు ఆ రసాయనాలు నీటిలో కలిసి కలుషితమై ఉండవచ్చని, ఆ నీటిని వాడడం వల్ల అక్కడి ప్రజలకు జ్వరాలు, కణుతులు, కీళ్ల వాపులు మొదలగు లక్షణాలతో మరణాలకు దారితీశాయని అన్నారు. చాలామందికి మెడ దగ్గర వాపు, పొట్ట దగ్గర వాపు గడ్డలుగా ఏర్పడి సర్జరీ చేసిన తర్వాత కూడా చనిపోయారని తెలిపారు.

## చదువులో వెనకబడిన విద్యార్థినుల కోసం రైజింగ్ స్టార్



ఈపూరు సెప్టెంబర్ 12 (సందేశం టైమ్స్) : మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేస్తున్నామని జిసిడిఓ డి.రేవతి అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు కేజీబీవీ పాఠశాలను ఆమె సందర్శించారు. స్టోర్ రికార్డులను, విద్యార్థినుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 24 కేజీబీవీ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినులు 920 మంది, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థినిలు 841 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు 740 మంది ఉన్నారన్నారు. 6, 7, 8 వ తరగతుల్లో చదువులో వెనకబడిన 35 మంది విద్యార్థినులకు రైజింగ్ స్టార్ కార్యక్రమం పేరుతో విద్యా నైపుణ్యాలు పెంచేలా ప్రత్యేక శిక్షణిస్తున్నట్లు తెలిపారు. 'విజయ పథం' ద్వారా ప్రతి మంగళ, శనివారాల్లో ఒక సబ్జెక్టుపై తర్ఫీదునిచ్చి పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. 'విద్యాశక్తి' ద్వారా ఐఐటి మద్రాస్ వారితో సబ్జెక్టులలో నైపుణ్యం సాధించేలా జూమ్ క్లాసుల నిర్వహణ ఉంటుందన్నారు. 6వ తరగతి నుండి ఇంటర్ విద్యార్థినులకు పాల్ ల్యాబ్ ద్వారా బోధన జరుగుతోం దన్నారు. అనంతరం ఏపీ మోడల్ స్కూల్‌ను సందర్శించి ఒకేషనల్ కోర్సు తరగతుల నిర్వహణను పరిశీలించారు.

## విషాహారం తిని కుటుంబం అస్వస్థత



పార్వతీపురం టౌన్: సెప్టెంబర్ 12 (సందేశం టైమ్స్) : మండలంలోని గంగాపురం పంచాయతీ పనసభద్రలో, ఒక కుటుంబానికి చెందిన ఆరుగురు తమ ఇంట్లో వండిన ఆహారం తిని అస్వస్థతకు గురైన సంఘటన చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై సంతోషి కుమారి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పనసభద్రకు చెందిన మువ్వల లక్ష్మి (60), మువ్వల శాంతమ్మ (56), మువ్వల సావిత్రి (48), మువ్వల తవిటమ్మ (38), మువ్వల రమణమ్మ(30) మొబైల్ రమేష్ అలియాస్ చరణ్(19) ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారు. దీనికి ప్రధాన కారణం కూరలో నూనె అనుకుని పొరపాటున గడ్డి మందు వేసి వండడంతో ఆ ఆహారం తిన్న వెంటనే అస్వస్థతకు గురవడంతో చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రిలో చేరారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారని కుటుంబ సభ్యులందరూ క్షేమంగా ఉన్నారని రూరల్ ఎస్సై తెలియజేశారు.

# క్యాచ్‌పిట్‌లో పడిన చిన్నారి..



- తల్లి అప్రమత్తతతో త్రుటిలో తప్పిన ప్రమాదం
%- పాఠశాలకు వెళ్తుండగా ఘటన
- వరద నీటి ప్రవాహం లేకపోవడంతో సురక్షితం
- వ్యర్థాలు తొలగించి క్యాచ్‌పిట్ మూత పెట్టని సిబ్బంది
- హైడ్రా పనులు చేసిందంటున్న జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు
- సమగ్ర విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు
- నేడు ఆయా విభాగాల సమావేశం

హైదరాబాద్ సిటీ సెప్టెంబర్ 12 (సందేశం టైమ్స్) : ఓ చిన్నారి వరద నీటి కాలువలో ప్రమాదవశాత్తు పడిపోయింది. తల్లి అప్రమత్తతతో క్షేమంగా బయటపడింది. వివరాల్లోకి వెళ్తే.. మౌలా కా చిల్లా ప్రాంతానికి చెందిన మహమ్మద్ సల్మాన్ కుమార్తె జైనబ్ స్థానికంగా ఉన్న ఓ పాఠశాలలో యూకేజీ చదువుతోంది. ఉదయం తల్లితో కలిసి పాఠశాలకు బయలుదేరింది. గుడ్ లక్ కిరాణ దుకాణం సమీపంలోకి వచ్చే సరికి వరద నీటి కాలువపై క్యాచ్‌పిట్ మూత తెరిచి ఉ ండడం గమనించక ప్రమాదవశాత్తు అందులో పడిపోయింది. వెంటనే అప్రమత్తమైన తల్లి జైనబ్‌ను బయటకు తీసింది. స్థానికులు జైనబ్‌కు సపర్యలు చేసి ఆమెలో ధైర్యాన్ని నింపి తల్లితో పాటు పాఠశాలకు పంపించారు. ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఆ కాలువలో వరద నీటి ప్రవాహం లేకపోవడంతో చిన్నారి సురక్షితంగా బయటపడింది. లేని పక్షంలో వరద ఉధృతికి కొట్టుకుపోయేదని స్థానికులు చెబుతున్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) అప్రమత్తం చేయడంతో జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు, హైడ్రా విభాగాల అధికారులు సల్మాన్ ఇంటికి క్యూ కట్టారు. చిన్నారి పరిస్థితి ఎలా ఉంది? గాయాలయ్యాయా..? అని ఆరా తీశారు. దక్షిణ మండలం జోనల్ కమిషనర్ ఓ ప్రకటనలో బుధవారం అక్కడ హైడ్రా మాన్సూన్ టీమ్ ఆధ్వర్యంలో పని చేశారని తెలిపారు.

# 967 డిగ్రీ కళాశాలల్లో 2.41 లక్షల సీట్లు



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (సందేశం టైమ్స్) : డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన దోస్త్ స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. సంబంధిత వివరాలను ఉ న్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం 967 డిగ్రీ కళాశాలల్లో 2,41,936 సీట్లు ఉన్నాయన్నారు. శుక్రవారం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, యునివర్సిటీ కళాశాలలు, గురుకులాల్లో కోర్సుల వారీగా ఖాళీగా ఉన్న సీట్ల వివరాలను ఆయా కళాశాలల నోటీసు బోర్డులపై ప్రకటిస్తామని తెలిపారు. ఈ నెల 15, 16 తేదీల్లో ప్రవేశాల ప్రక్రియ ఉంటుందన్నారు. ఇంటర్ అర్హత కలిగిన విద్యార్థులు నేరుగా కళాశాల ప్రిన్సిపాళ్లను కలిసి ధ్రువీకరణ పత్రాలు చూపించి ప్రవేశాలు పొందవచ్చన్నారు. ప్రవేశాల్లో స్థానిక విద్యార్థులకు తొలి ప్రాధాన్యం ఇస్తామని, వారు లేని పక్షంలోనే స్థానికేతరులకు అవకాశం కల్పిస్తామని తెలిపారు.

# జీహెచ్ఎంసీలో ఇన్వెంటరీ యాప్..




హైదరాబాద్ సిటీ: సెప్టెంబర్ 12 (సందేశం టైమ్స్) : అధికారులు, ఉద్యోగులకు ఇచ్చే ఎలక్ట్రానిక్ వస్తువుల సమగ్ర జాబితా డిజిటలైజ్ చేయాలని జీహెచ్ఎంం నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఇన్వెంటరీ యాప్ రూపకల్పనకు ఐటీ విభాగం కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం మాన్యువల్‌గా వివరాలు నమోదు చేసి.. కంప్యూటరీకరణ చేస్తుండగా ఇక నుంచి వస్తువులకు సంబంధించి ఇండెంట్ నుంచి ఆమోదం, జారీ వరకు అంతా యాప్‌లో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.సాధారణంగా సంస్థలోని అన్ని సెక్షన్లకు అవసరాన్ని బట్టి కంప్యూటర్ ప్రాసెసింగ్ యూనిట్(సీపీయూ), మానిటర్, కేబుళ్లు, మౌస్‌లు, ప్రింటర్లు, జిరాక్స్ యంత్రాలు వంటివి ఐటీ విభాగం సమకూరుస్తోంది. హోదాను బట్టి కొందరు అధికారులకు ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లూ ఇస్తారు. పలువురు అధికారులు, కొన్ని విభాగాలు ఆయా వస్తువులు తరచూ తీసుకుంటున్నట్లు గుర్తించారు.%అంతకుముందు ఎప్పుడు వస్తువులు ఇచ్చామన్న వివరాలు ఇచ్చామన్న పూర్తిస్థాయి సమాచారం ఐటీ విభాగం వద్ద లేకపోవడం వల్లే దుర్వినియోగం జరుగుతుందన్న అంచనాకు వచ్చారు. ఐటీ విభాగంలోని కొందరు ఉద్యోగులు నచ్చిన అధికారులు అడిగిన వస్తువులు ఇస్తుంటారు. ఈ పద్ధతికి చెక్ పెట్టేలా డిజిటలైజేషన్ నిర్ణయం తీసుకున్నట్లు ఓ అధికారి తెలిపారు.ఏ విభాగం/అధికారి ఏ వస్తువు కోసం ప్రతిపాదన పెట్టారు..? ఎప్పుడు సరఫరా చేశాం..? తదితర వివరాలు ఇక నుంచి యాప్‌లో నమోదు కానున్నాయి. ఫలాన వస్తువు కావాలన్న విజ్ఞప్తి నుంచి దానిని పరిశీలించి ఐటీ విభాగం అధికారులు ఆమోదం, సరఫరా వరకు అన్ని వివరాలు యాప్‌లో ఉంటాయి. సంబంధిత విభాగం/ అధికారులకు సరఫరా చేసే ముందు బార్ కోడ్ స్కానింగ్ చేస్తే వివరాలు యాప్‌లో ఎంటర్ కానున్నాయి. దీంతో ఎవరు ఎప్పుడు ఏ వస్తువు తీసుకున్నారన్నది సులువుగా తెలుస్తుంది.


# సర్కారు వైద్యానికి భయపడిన గర్భిణి

**ధైర్యం చెప్పిన వైద్య సిబ్బంది**
**రిమ్స్‌లో మగబిడ్డకు జన్మనిచ్చిన మహిళ**



ఆదిలాబాద్, సెప్టెంబర్ 12 (సందేశం టైమ్స్) : ప్రభుత్వ ఆస్పత్రిలో పురుడు పోసుకునేందుకు భయపడిన గర్భిణికి సర్కారు వైద్య సిబ్బంది ధైర్యం కల్పించారు. ప్రభుత్వ సేవలు సురక్షితమని, అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని నమ్మకం కల్పించడంతో చివరకు సర్కారు దవాఖానలో వైద్యానికి అంగీకరించింది. ఆస్పత్రికి తరలించిన గంటలోపే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆదిలాబాద్ దహిగూడ గ్రామానికి చెందిన ఆత్రం భీంబాయి అనే మహిళను ప్రసవం కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించేందుకు అంకోలి పీహెచ్‌సీ సిబ్బంది గ్రామానికి వెళ్లారు. తన కోసం వైద్య సిబ్బంది వస్తున్నారన్న భయంతో సమీపంలో ఉన్న పత్తిచేనులో మహిళ దాక్కుంది. గంట సేపు వెతకగా పత్తి చేనులో తన కుమారుడితో పాటు ఉన్న మహిళను వైద్య సిబ్బంది గుర్తించారు. కౌన్సెలింగ్ తర్వాత ఆస్పత్రికి వచ్చేందుకు ఆమె ఒప్పుకొంది. ఆమెను జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా, సాధారణ ప్రసవం అయింది. ప్రస్తుతం తల్లి, బిడ్డల ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని వైద్యులు తెలిపారు.

# ఆర్ఆర్ రైలుకు 6 వేల ఎకరాలు




హైదరాబాద్, సెప్టెంబర్ 12 (సందేశం టైమ్స్) : తెలంగాణకు కేంద్రం మంజూరు చేసిన రీజినల్ రింగు రైలు అలైన్‌మెంట్ మారింది. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్)కు 10 కిలోమీటర్ల దూరంలో నిర్మించాలని తొలుత అనుకున్నప్పటికీ.. ఈ రైలు మార్గాన్ని రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్)కు పక్కనే నిర్మించాలనే నిర్ణయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వచ్చాయి. ఈమేరకు.. మార్చిన రైలు మార్గం అలైన్‌మెంట్‌పై సీఎం రేవంత్ కేంద్ర రైల్వే శాఖ ఉన్నతా?ధికారులతో కలిసి సమీక్షించారు. రాష్ట్రానికి రింగు రైలు మంజూరైనప్పుడు అనుకున్న అలైన్‌మెంట్.. ఇప్పుడు రింగు రోడ్డు పక్కనే రైలును నిర్మించేందుకు రూపొందించిన ప్రాథమిక అలైన్‌మెంట్ల వివరాలను రైల్వే అధికారులు సీఎంకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో తెలియజేశారు. తాజాగా రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం రీజినల్ రింగు రోడ్డు పక్కనే రైలు మార్గాన్ని నిర్మించేందుకు 45 మీటర్ల వెడల్పుతో భూమి కావాలని తెలిపారు. అలాగే 362 కిలోమీటర్ల మేర రైలుమార్గం ఉంటుందని, ఈ మధ్యలో దాదాపు 19 స్టేషన్లు వస్తాయని వివరించారు. రైలు మార్గం, స్టేషన్ల నిర్మాణం, భూసేకరణ పరిహారం.. వీటన్నింటికీ కలిపి దాదాపు రూ.25,550 కోట్ల వరకూ ఖర్చవుతుందని వెల్లడించారు. ప్రస్తుత ం తెలంగాణ, హైదరాబాద్ మీదుగా వెళ్తున్న రైలు మార్గాల్లో సుమారు 6 మార్గాలకు సంబంధించిన స్టేషన్లు కూడా దీంతో అనుసంధానమవుతాయని పేర్కొన్నారు. రింగు రైలు మార్గం కోసం 4030 ఎకరాలు, రైల్వే స్టేషన్ల నిర్మాణం కోసం 1090 ఎకరాలు, ఇతర రైలు మార్గాల కనెక్టివిటీల కోసం 937 ఎకరాలు.. ఇలా మొత్తం 6 వేల ఎకరాల భూమి అవసరం అవుతుందని తెలిపారు. కాగా రీజినల్ రింగు రైలు అలైన్‌మెంటు మారుతోందని, రీజినల్ రింగు రోడ్డుకు పక్కనే రాబోతుందని ముందే చెప్పింది. 'ఆర్ ఆర్ఆర్ పక్కనే రైలు' శీర్షికన జూలై 21న ఒక కథనాన్ని ప్రచురించింది. రింగు రోడ్డు పక్కనే రైలు నిర్మాణానికి అవసరమైన 45 మీటర్ల భూమి విషయమే సందిగ్ధంగా మారింది. రింగు రోడ్డు ఉ త్తరభాగం నిర్మాణానికి అవసరమై భూమిలో దాదాపు భూ సేకరణ చివరిదశకు చేరింది. దక్షిణభాగంలో ఇంకా భూ సేకరణ ప్రారంభంకాలేదు. కాబట్టి ఈ భాగంలో రో డ్డు, రైలు మార్గాలకు అవసరమైన మేరకు భూమిని సేకరించుకునే అవకాశం ఉంది. ఇప్పుడు ఉ త్తరభాగం వైపు రైలు మార్గానికి అవసరమైన భూ మిని ఎలా సర్దుబాటు చేయాలనేదానిపైనే ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈ మార్గంలో రోడ్డు కోసం ఇప్పటికే 100 మీటర్ల వెడల్పుతో భూమిని సేకరించారు, మళ్లీ ఇప్పుడు దీనికి అదనంగా 45మీటర్లను సేకరించేందుకు ఉన్న అవకాశాలు, ఏర్పాట్లపై సమాలోచనలు చేస్తోంది.

# మూడు ప్రాజెక్టులకు పెట్టుబడి అనుమతిలివ్వండి



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (సందేశం టైమ్స్) : రాష్ట్రంలోని మూడు ప్రాజెక్టులకు పెట్టుబడి అనుమతి(ఇన్వెస్టమెంట్ క్లియరెన్స్) కోసం ప్రభుత్వం దరఖాస్తు చేసుకుంది. ముక్తేశ్వర్(చిన్న కాళేశ్వరం), మొుడికుంటవాగు, చనాకా కొరాటాలో డిస్ట్రిబ్యూటరీ పనుల కోసం పెట్టుబడి అనుమతులు ఇవ్వాలని కేంద్ర జలవనరుల సంఘాన్ని(సీడబ్ల్యూసీ) కోరింది. ఈ ప్రాజెక్టుల డీపీఆర్‌లకు ఇదివరకే సీడబ్ల్యూసీ క్లియరెన్స్ ఇవ్వగా.. సాంకేతిక సలహా కమిటీ(టీఏసీ) సాంకేతిక అనుమతి కూడా ఇచ్చింది. ఇక ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన(పీఎంకేఎసవై-ఏఐబీపీ) కింద ఏ ప్రాజెక్టుకు కేంద్ర సహాయం కోరాలన్నా.. సీడబ్ల్యూసీ నుంచి ఇన్వెస్టమెంట్ క్లియరెన్స్ తీసుకోవాల్సిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు ఇన్వెస్టమెంట్ క్లియరెన్స్ కోసం అర్జీ పెట్టుకున్నారు.



# క్రీడావార్తలు



# బంగ్లా అవలీలగా ఆసియా కప్




అబుధాబి: కెప్టెన్ లిట్టన్ దాస్ (39 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 59) అర్ధసెంచరీతో ఆసియాక్‌పలో బంగ్లాదేశ్ బోణీ చేసింది. గురువారం గ్రూప్ 'బి'లో భాగంగా హాంకాంగ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో బంగ్లా ఏడు వికెట్ల తేడాతో నెగ్గింది. తౌహీద్ హ్రిదయ్ (35 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన హాంకాంగ్ 20 ఓవర్లలో 143/7 స్కోరు సాధించింది. నిజాకత్ ఖాన్ (42), ఓపెనర్ జీషన్ అలీ (30), యాసిన్ ముర్తజా (28) మాత్రమే రాణించారు. పేసర్లు తన్‌జీమ్ హసన్, టస్కిన్ అహ్మద్, స్పిన్నర్ రిషాద్ రెండేసి వికెట్లు సాధించారు. ఆ తర్వాత ఛేదనలో బంగ్లాదేశ్ 17.4 ఓవర్లలో 3 వికెట్లకు 144 పరుగులు చేసి నెగ్గింది. పవర్‌ప్లేలో ఓపెనర్లు పర్వేజ్ (19), తన్‌జీద్ (14) వికెట్లు కోల్పోయినా 51/2 స్కోరుతో జట్టు మెరుగైన స్థితిలో నిలిచింది. అయితే ఆ తర్వాత 7-12 ఓవర్ల మధ్య హాంకాంగ్ బౌలర్లు ఒక్క బౌండరీ కూడా ఇవ్వకపోవడంతో మ్యాచ్‌పై ఆసక్తి నెలకొంది. కానీ కెప్టెన్ లిట్టన్ వరుస ఫోర్లతో స్కోరును గాడిలో పెట్టాడు. 16వ ఓవర్‌లో 6,4తో 16 రన్స్ సాధించిన అతడు 33 బంతుల్లోనే హాఫ్ సెంచరీ కూడా పూర్తి చేశాడు. అతడికి మరో ఎండ్‌లో హ్రిదయ్ సహకరించగా మూడో వికెట్‌కు 95 పరుగుల భాగస్వామ్యం సమకూరింది. విజయానికి రెండు పరుగుల దూరంలో లిట్టన్ వెనుదిరిగినా మరో 14 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది. పేసర్ల కట్టడి: అఫ్ఘాన్‌పై 94 పరుగులకే పరిమితమైన హాంకాంగ్ ఈసారి కాస్త మెరుగ్గానే ఆడింది. అయితే ఆరంభంలో బంగ్లా పేసర్లు ఇబ్బందిపెట్టడంతో పవర్‌ప్లేలో 34 రన్స్‌కే రెండు వికెట్లు కోల్పోయింది. ఈ స్థితిలో నిజాకత్ ఖాన్, ఓపెనర్ జీషన్ అలీ ఆదుకునే ప్రయత్నం చేశారు. ఆరంభంలో తడబడిన జీషన్ తొమ్మిదో ఓవర్‌లో 6,4తో బ్యాట్ ఝుళిపించాడు. ఆ తర్వాత అడపాదడపా బౌండరీలతో వేగం పెంచిన అతడిని తన్‌జీమ్ అవుట్ చేశాడు. ఈ దశలో యాసిన్ ముర్తజా ధాటిగా ఆడి స్కోరులో వేగం చూపాడు. కానీ 18వ ఓవర్‌లో అతడు రనౌట్ కావడంతో నాలుగో వికెట్‌కు 46 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాతి ఓవర్‌లోనే నిలకడగా ఆడుతున్న నిజాకత్, కించిత్ (0)లను స్పిన్నర్ రిషాద్ అవుట్ చేయడంతో హాంకాంగ్ స్వల్ప స్కోరుకే పరిమితమైంది.హాంకాంగ్ :20 ఓవర్లలో 143/7: (నిజాకత్ ఖాన్ 42, జీషన్ అలీ 30 తన్‌జీమ్ 2/21, రిషాద్ 2/31, టస్కిన్ 2/38)బీ బంగ్లాదేశ్ 17.4 ఓవర్లలో 144/3 : (లిట్టన్ దాస్ 59, హ్రిదయ్-నాటౌట్ 35, ఇక్బాల్ 2/14, శుక్లా 1/32).మహిళల వన్డే వరల్డ్ కప్ దుబాయ్ : మహిళల వన్డే వరల్డ్ కప్ చరిత్రలో తొలిసారి..మెగా టోర్నీలో అంతా అతివలే మ్యాచ్ అధికారులుగా వ్యవహరించనున్నారు. ఈమేరకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 14 మందితో కూడిన మ్యాచ్ అధికారుల జాబితాను గురువారం ప్రకటించింది. ఇందులో..అంతర్జాతీయ మహిళా క్రికెట్‌లో తొలి మహిళా మ్యాచ్ రెఫరీగా ఖ్యాతి గాంచిన తెలుగు మాజీ క్రికెటర్ జీఎస్ లక్ష్మికి చోటు దక్కింది. మొత్తం నలుగురు మ్యాచ్ రెఫరీలుగా వ్యవహరించనున్నారు. అలాగే 14 మంది అంపైర్లలో భారత్‌నుంచి మాజీ క్రీడాకారిణులు వ్రింద రాథీ, ఎన్.జనని, గాయత్రీ వేణుగోపాలన్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. వన్డే వరల్డ్ కప్ భారత్, శ్రీలంక వేదికలుగా ఈనెల 30న ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే.

## సెమీఫైనల్లో పూజ భారత్‌కు మరో పతకం ఖాయం



లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్సలో భారత్‌కు మూడో పతకం ఖాయమైంది. మహిళల 80 కి. విభాగంలో పూజారాణి సెమీఫైనల్‌కు చేరిం ది. బుధవారం అర్ధరాత్రి హోరాహోరీగా జరిగిన క్వార్టర్ ఫైనల్లో 34 ఏళ్ల పూజ 3-2తో ఎమీలియా కొటెర్‌స్కా (పోలెండ్) ఓడించింది. సెమీసకు చేరిన పూజారాణికి కనీసం కాంస్యం లభించనుంది. ప్రపంచ పోటీలలో ఆమెకిదే తొలి పతకం. ఇక జైస్మీన్ లంబోరియా (మహిళల 57కి.), నూపుర్ షెరాన్ (మహిళల 80ంకి.) ఇంతకుముందే సెమీఫైనల్‌కు చేరడంతో భారత్‌కు కనీసం రెండు కాంస్య పతకాలు ఖరారైన సంగతి తెలిసిందే. పురుషుల 65కి. కేటగిరీ క్వార్టర్‌ఫైనల్లో అభినాష్ జమ్వల్ 1-4తో ఒలింపిక్ కాంస్య పతక విజేత లాష గురులీ (జార్జియా) చేతిలో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

## యు ముంబా ఉత్కంఠ గెలుపు



ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) తొలి అంచె లీగ్ మ్యాచ్‌లలో యు ముంబా జోరు కొనసాగుతోంది. పట్నా పైరేట్స్‌తో గురువారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో యు ముంబా 40-39 స్కోరుతో విజయం సాధించింది. ప్రథమార్థం ముగిసేసరికి యు ముంబా 23-15 ఆధిక్యంలో ఉంది. ద్వితీయార్థం 10వ నిమిషం నుంచి ఇరు జట్లు సమాన పాయింట్లతో స్కోరు బోర్డును నడిపించడంతో మ్యాచ్ రసవత్తరంగా మారింది. గెలుపు అంచున ఉన్న పట్నా చివరి సెకన్లలో పొరపాట్లు చేసి చేజేతులా ఓటమిపాలైంది. మరో మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 38-28తో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది.

## సింగిల్స్ బరిలో దక్షిణేశ్వర్

బీల్ (స్విట్జర్లాండ్): డేవిసకప్ వరల్డ్ గ్రూప్-1లో పటిష్ట స్విట్జర్లాండ్‌ను ఎదుర్కొనేందుకు భారత జట్టు కీలక నిర్ణయం తీసుకుంది. నేటి నుంచి జరిగే ఈ పోటీల్లో రిజర్వ్ ఆటగాడిగా ఉన్న దక్షిణేశ్వర్ సురేశ్‌తో సింగిల్స్ ఆడించబోతున్నారు. ఆరు అడుగుల ఐదు అంగుళాల ఈ మధురై ఆటగాడు ట్రైనింగ్ సెషన్‌లో భారీ సర్వీసలతో ఆకట్టుకున్నాడు. అందుకే ఇండోర్ హార్డ్ కోర్టుల్లో సాగే పోటీలకు సురేశ్ ఆట సరిగ్గా సరిపోతుందని కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్ భావిస్తున్నాడు. శుక్రవారం జరిగే తొలి సింగిల్స్‌లో దక్షిణేశ్వర్.. జెరోమ్ కిమ్‌తో తలపడనున్నాడు. అలాగే భారత నెంబర్‌వన్ ఆటగాడు సుమిత్ నగాల్ మరో సింగిల్స్ ఆడనున్నాడు. అయితే యూఎస్ ఓపెన్‌లో గాయపడిన డబుల్స్ స్టార్ యుకీ భాంబ్రీ ఇంకా కోలుకోలేదు. దీంతో 13న జరిగే డబుల్స్‌లో శ్రీరామ్ బాలాజీకి జతగా హైదరాబాదీ రిత్విక్ బొల్లిపల్లి బరిలోకి దిగుతాడు. 1993లో చివరిసారి స్విస్‌తో తలపడిన భారత్ ఓవరాల్‌గా 2-1తో ఆధిక్యంలో ఉ




ంది. తాజా వరల్డ్ గ్రూప్-1లో విజేత డేవిసకప్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధిస్తుంది. ఓడిన జట్టు వరల్డ్ గ్రూప్ 1 ప్లేఆఫ్సకు పడిపోతుంది.

## ఆయుష్ సంచలన విజయం




హాంకాంగ్: భారత వర్ధమాన షట్లర్ ఆయుష్ షెట్టి సంచలన విజయంతో హాంకాంగ్ ఓపెన్ క్వార్టర్స్‌కు చేరుకొన్నాడు. లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్ జోడీ కూడా రౌండ్-8కు చేరుకొన్నాయి. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో ఆయుష్ 21-19, 12-21, 21-14తో 2023 వరల్డ్ చాంపియన్‌షిప్స్ రజతపతక విజేత కొడాయ్ నరోకా (జపాన్)పై పోరాడి గెలిచాడు. రౌం డ్-8లో భారత్‌కే చెందిన లక్ష్యసేన్‌తో ఆయుష్ తలపడతాడు. కాగా సహచర షట్లర్ల మధ్య పోరులో సేన్ 15-21, 21-18, 21-10తో ప్రణయ్‌ను ఓడించాడు. కిరణ్ జార్జ్ 6-21, 12-21తో చోట్ సి (చైనీస్ తైపీ) చేతిలో చిత్తయ్యాడు. డబుల్స్‌లో సా త్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జంట 18-21 21-15, 21-11తో టీరారట్‌సకుల్-సుక్‌పున్

## భారత్ జోరుకు బ్రేక్ చైనా చేతిలో ఓటమి



హాంగ్జౌ (చైనా): ఆసియా కప్‌లో భారత అమ్మాయిల జోరుకు బ్రేక్ పడింది. అప్రతిహత విజయాలతో దూసుకుపోతున్న మనోళ్లకు ఆతిథ్య చైనా షాకిచ్చింది. గురువారం జరిగిన సూపర్-4 మ్యాచ్‌లో చైనా 4-1తో భారత్‌పై నెగ్గింది. ముంతాజ్ (38వ ని.) భారత్‌కు ఏకైక గోల్ అందించింది. జూ మీరాంగ్ (4, 56 ని.), చెన్ యాంగ్ (31), టాన్ జిన్హ్వాంగ్ (47) చైనా తరపున గోల్స్ చేశా రు. శుక్రవారం జరిగే తదుపరి పోరులో జపాన్‌తో భారత్ తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే మనోళ్లకు ఫైనల్ బెర్త్ ఖాయమవుతుంది.

# బిజినెస్



## ఇన్ఫీ రూ 18000 కోట్ల బైబ్యాక్




బెంగళూరు: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ రూ.18,000 కోట్ల విలువైన షేర్లను మార్కెట్ నుంచి తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేయనున్నట్లు ప్రకటించింది. కంపెనీ మొత్తం పెయిడప్ ఈక్విటీ షేర్ క్యాపిటల్‌లో 2.41 శాతానికి సమానమైన 10 కోట్ల షేర్లను తిరిగి కొనుగోలు చేయనున్నట్లు, ఒక్కో షేరుకు రూ.1,800 చెల్లించనున్నట్లు తెలిపింది. గురువారం సమావేశమైన కంపెనీ బోర్డు సభ్యులు ఈ బైబ్యాక్ ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. కాగా ఇన్ఫోసిస్ చరిత్రలో ఇదే అతిపెద్ద బైబ్యాక్ కానుంది. గడిచిన మూడేళ్లలో ఇదే మొదటిసారి. సంస్థ స్టాక్ మార్కెట్లో లిస్టయినప్పటి నుంచి ఇది ఐదోసారి.బీఎసఈలో ఇన్ఫోసిస్ షేరు ధర గురువారం 1.51 శాతం తగ్గి రూ.1,509.5 వద్ద ముగిసింది. ఈ ముగింపు ధరతో పోలిస్తే కంపెనీ షేర్ల తిరిగి కొనుగోలు కోసం 19 శాతం అధికంగా చెల్లించనుంది. ఈ జూన్ త్రైమాసికం చివరినాటకి కంపెనీ 88.4 కోట్ల డాలర్ల (సుమారు రూ.7,805 కోట్లు) ఫ్రీ క్యాష్‌ఫ్లోను నమోదు చేసింది. తాజా బైబ్యాక్ ప్రతిపాదనకు కంపెనీ వాటాదారులూ ఆమోదం తెలపాల్సి ఉంటుంది.ఇన్ఫోసిస్ తాజా నిర్ణయం నేపథ్యంలో దేశంలో అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస (టీసీఎస్) కూడా షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించవచ్చని హాంకాంగ్‌కు చెందిన బ్రోకరేజీ సంస్థ సీఎల్ఎసఏ అభిప్రాయపడింది. 2023 డిసెంబరుతో ముగిసిన బైబ్యాక్‌లో టీసీఎస్ రూ.17,000 కోట్ల విలువైన షేర్లను తిరిగి కొనుగోలు చేసింది. 2022లో రూ.18,000 కోట్ల షేర్లను బైబ్యాక్ చేసింది. ఈ విడత టీసీఎస్ రూ.20,000 కోట్ల షేర్లను తిరిగి కొనుగోలు చేయవచ్చని సీఎల్ఎసఏ అంచనా వేస్తోంది.

## హైదరాబాద్‌లో ఎంజీ సెలెక్ట్

జేఎసడబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా హైదరాబాద్‌లో ఎంజీ సెలెక్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. బంజారాహిల్స్‌లో ఏర్పా టు చేసిన ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కంపెనీ లగ్జరీ ఎలక్ట్రిక్ కార్లు ఎంజీ సైబర్‌స్టర్, ఎంజీ ఎం9 లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారత్ చమురు దిగుమతులను తగ్గించుకోవాలంటే దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాల్సి ఉందన్నారు. ఇంధన స్వయం సమృద్ధిని సాధించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలు దోహదపడతాయన్నారు. దేశీయంగా పునరుత్పాదక ఇంధన వనరులను పూర్తి స్థాయిలో వినియోగించుకునేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని వివరించారు. కాగా హైదరాబాద్ మార్కెట్లోకి ఎంజీ స్పోర్ట్స్‌కారు సైబర్‌స్టర్, ఎం9 కార్లను విడుదల చేయటం ఎంతో సంతోషంగా ఉందని ఎంజీ సెలెక్ట్ హెడ్ మిలింద్ షా అన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 13 నగరాల్లో 14 ఎంజీ సెలెక్ట్ సెంటర్లు ఉన్నాయని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో సైబర్‌స్టర్, ఎం9 కార్లకు వినియోగదారుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని, ఇప్పటికే 250 కార్లు బుకింగ్స్ కావటమే



ఇందుకు నిదర్శనమని ఎంజీ సెలెక్ట్ జయలక్ష్మీ మోటార్స్ ఇండియా డీలర్ ప్రిన్సిపల్ పీ గౌతమ్ సాయి తెలిపారు. ఎంజీ సైబర్‌స్టర్ ఒకసారి చార్జింగ్‌తో 580 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. దీని ధర రూ.74.99 లక్షలు (ఎక్స్‌షోరూమ్). అయితే ప్రీ బుకింగ్స్ కోసం పరిచయ ధర రూ.72.49 లక్షలుగా ఖరారు చేసింది. ఎంజీ ఎం9 ధర రూ.69.90 లక్షలుగా ఉంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.


## మరో విడత పీఎస్ బీల విలీనాలు




న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో (పీఎసబీ) మరో విడత విలీనాలకు కేంద్రం సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది. ఆస్తుల విలువ పరంగా ప్రస్తుతం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మాత్రమే ప్రపంచంలోని 100 అతిపెద్ద బ్యాంకుల జాబితాలో ఉన్నాయి. వీటి తరహా లో మరో 3-4 మెగా పీఎసబీలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ఈసారి విలీనాలను చేపట్టనున్నట్లు సమాచారం. వికసిత్ భారత్ లక్ష్యాల సాధనకు దేశంలో మరిన్ని ప్రపంచ స్థాయి బ్యాంకుల ఏర్పాటు అవసరమని మోదీ సర్కారు భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ నెల 12-13 తేదీల్లో ప్రభుత్వ రంగ బ్యాంకుల సారథులు, ఆర్‌బీఐ, ఆర్థిక శాఖ అధికారులతో కేంద్రం నిర్వహించే రెండు రోజుల మేధోమథనం కార్యక్రమంలో పీఎసబీల మలి విడత విలీనాల ప్రతిపాదనపై చర్చ జరగనుందని వారన్నారు. చివరిసారి 2020లో మోదీ ప్రభుత్వం పీఎసబీల విలీనాలను జరిపింది. దీంతో పీఎసబీల సంఖ్య 27 నుంచి 12కు తగ్గింది. విలీనాల అంచనాల నేపథ్యంలో లిస్టెడ్ పీఎస్‌బీల షేర్లు గురువారం లాభాల్లో పయనించాయి. దాంతో బ్యాంక్ నిఫ్టీ దాదాపు ఒక శాతం పెరిగింది.

## డాక్టర్ రెడ్డీస్ చేతికి వర్టిగో ఔషధం

వర్టిగో (తల తిరగటం) చికిత్సలో ఉపయోగించే స్టగెరాన్ బ్రాండ్ కొనుగోలుకు జాన్సన్ అండ్ జాన్సన్ (జే అండ్ జే)తో కీలక ఒప్పందం కుదుర్చుకున్నట్టు డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ప్రకటించింది. ఈ ఒప్పందంతో భారత్, వియ త్నాం కీలక మార్కెట్లుగా ఈఎంఈఏ దేశాల్లో స్టగెరాన్ బ్రాండ్ హక్కులు డాక్టర్ రెడ్డీసకు దక్కుతాయి. స్టగెరాన్‌లో వర్టిగో, వెస్టిబ్యులార్ రుగ్మత చికిత్సలో ఉపయోగపడే సినారిజిన్ ఔషధం ఉంటుంది. యాంటీ-వర్టిగో, సెంట్రల్ నెర్వస్ సిస్టమ్ (సీఎన్ఎస) పోర్ట్‌ఫోలియో శక్తివంతం చేసుకునేందుకు ఈ బ్రాండ్ కొనుగోలు దోహదపడుతుందని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది.




## పసిడి రుణాలు రికార్డు స్థాయికి



న్యూఢిల్లీ: బంగారం విలువ వేగంగా ఎగబాకుతోంది. గడిచిన ఏడాది కాలంలో 10 గ్రాముల పసిడి రేటు 53 శాతం పెరిగింది. దాంతో బంగారం తాకట్టు పెట్టి తీసుకునే రుణాలూ అంతకంటే వేగంగా పెరుగుతున్నాయి. ఆగస్టు నెలలో బ్యాంకుల గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియో సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.2.94 లక్షల కోట్లకు చేరుకుంది. 2024 ఏప్రిల్‌లో ఇది కేవలం రూ.1.02 లక్షల కోట్లే. ఈ రుణాలు ఆల్‌టైం రికార్డు స్థాయికి పెరగడం వరుసగా ఇది 15వ నెల. అంతేకాదు, ఈ మార్చి నుంచి ప్రతినెలా ఈ రుణాల్లో వార్షిక ప్రాతిపదికన 100 శాతానికి పైగా వృద్ధి నమోదైంది. బంగారం ధరలు పెరుగుతున్నంత కాలం గోల్డ్ లోన్స్‌లోనూ అప్‌ట్రెండ్ కొనసాగనుందని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కార్తీక్ శ్రీనివాసన్ అన్నారు. %ఇవీ కారణాలు: బంగారం తాకట్టుపై గతంలో కంటే అధికం రుణం లభిస్తుండటం, బ్యాంకులు తనఖా రహిత వ్యక్తిగత రుణాల మంజూరులో ఆచితూచి వ్యవహరిస్తుండటం ఇందుకు ప్రధానం కారణం. వ్యక్తిగత రుణంతో పోలిస్తే గోల్డ్ లోన్స్‌పై వడ్డీ కూడా తక్కువగా ఉండటమూ మరో కారణం. వ్యక్తిగత రుణం లభించే అవకాశం లేనివారికి బంగారం తనఖా రుణాలు మంచి ప్రత్యామ్నయంగా మారాయని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి.దేశీయంగా బంగారం ధరలు సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయికి ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మరో రూ.100 పెరిగి రూ.1,13,100కు చేరింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం రేటు కూడా రూ.100 పెరిగి ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.1,12,600 స్థాయికి ఎగబాకింది. 2024 డిసెంబరు 31న రూ.78,950గా నమోదైన 10 గ్రాముల మేలిమి బంగారం ధర.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.34,150 మేర (43.25 శాతం) పుంజుకుంది. కాగా, కిలో వెండి రూ.500 పెరుగుదలతో రూ.1,28,000కు చేరుకుంది.

## సెమీకండక్టర్ పరిశ్రమ కోసం చిప్‌లెట్ ఆధారిత ఇంజనీరింగ్ సేవలు



న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం టీసీఎస్ దేశీయ సెమీకండక్టర్ పరిశ్రమకు అవసరమైన చిప్‌లెట్ ఆధారిత ఇంజనీరింగ్ సర్వీసును అభివృద్ధి చేసింది. ఈ చిప్‌లెట్ ఆధారిత ఇంజనీరింగ్ సేవలు సెమీకండక్టర్ల తయారీకి భారత్‌ను అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఎంతగానో దోహదం చేస్తాయని టీసీఎస్ వెల్లడించింది. ఈ రంగం లో నూతన ఆవిష్కరణలకూ ఇది ఉపకరిస్తుందని పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం 4,500 కోట్ల డాలర్ల నుంచి 5,000 కోట్ల డాలర్ల వరకు ఉన్న భారత సెమీకండక్టర్ల మార్కెట్ 2030 నాటికి 10,000 కోట్ల డాలర్ల నుంచి 11,000 కోట్ల డాలర్లకు చేరనుంది. ఇలాంటి కీలక సమయంలో తాము అందించే ఈ సరికొత్త సేవలు భారత సెమీకండక్టర్ పరిశ్రమకు ఎంతగానో తోడ్పడతాయని టీసీఎస్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ విభాగం ప్రెసిడెంట్ వీ రాజన్న తెలిపారు.

## ట్రంప్ సుంకాల ఎఫెక్ట్.. రూపాయి విలువ మరింతగా పతనం



ఇంటర్నెట్ డెస్క్: అమెరికా సుంకాల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువ మరింతగా పతనమైంది. డాలర్‌తో పోలిస్తే మారకం విలువ రూ.88.44ల వద్ద ఆల్ టైమ్ కనిష్టాన్ని తాకింది. ట్రంప్ సుంకాల నేపథ్యంలో మదుపర్ల నమ్మకం సన్నగిల్లటంతో రూపాయి విలువ అంతకంతకూ తగ్గుతోంది. ఈ ఏడాది ఇప్పటివరకూ భారత డెట్, ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ మదపర్లు 11.7 బిలియన్ డాలర్ల మేర ఉపసంహరించుకున్నారు (%అమెరికా సుంకాల నేపథ్యంలో భారత ఆర్థికాభివృద్ధి తగ్గే అవకాశం ఉందన్న అంచనాల నడుమ భారత ప్రభుత్వం ఇప్పటికే దేశీయంగా వినియోగం పెంచేందుకు పలు చర్యలు చేపట్టింది. జీఎస్టీ పన్నులను భారీగా తగ్గిస్తూ సంస్కరణలకు తెరతీసింది. సెప్టెంబర్ 22 నుంచి ఇవి అమల్లోకి రానున్నాయి. మరోవైపు, భారత్, అమెరికాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం కుదరనుందన్న వార్తలు కూడా వెలువడుతున్నాయి. ఈ విషయంలో చర్చల కోసం భారత బృందం త్వరలో అమెరికాలో పర్యటించనున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి ప్రస్తుత పరిస్థితుల్లో భారత ఎగుమతిదారులు అనిశ్చితిలో కూరుకుపోయారు. స్వల్పకాలిక ఎగుడుదిగుడులు తప్పవని విశ్లేషకులు భావిస్తున్నారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006